కర్తవ్యానికి గండి

దేవతార్చన ముగించి దేవుడి గదిలోంచి బయట కొచ్చాడు రమణయ్య.

"అబ్బాయి బై.పి.గ్రూపు దొరుకుతేనే చదువుతానంటున్నాడు" అన్నది జానకమ్మ అతడి చేతిలోంచి హారతిపళ్లెం అందుకుంటూ.

భార్య కళ్లల్లోకి ఒకమారు సూటిగా చూసి మౌనంగా వుండిపోయాడు రమణయ్య.

భర్త నోటినుండి ఏమాటా రాకపోవడంతో, "మీరోమారు కాలేజీకి వెళ్లరాదూ" అన్నది మళ్లీ.

"తగిన మార్కులుంటే తప్పకుండా వాడి కా గ్రూపు దొరుకుతుంది. సీటుకోసం ఎవర్నీ ప్రాధేయపడలేను" చిరాగ్గా కనుబొమ్మలు చిట్లించాడు రమణయ్య.

జానకమ్మ ఓ క్షణం ఆగి, "మిమ్మల్ని ప్రాధేయ పడమనడం లేదు ఒకమారు అబ్బాయితో కాలేజీకి వెళితే చాలు. మీరు ఎవరైందీ వాళ్లకు తెలుస్తుంది. వాడికి సీటూ వస్తుంది." అంది భర్త నయనాలలోకి ఆశగా చూస్తూ.

భార్య మాట కొట్టిపారేయలేక. "సరే, ఆ లాల్చీ ఇలా పారేయ్" అన్నాడు పంచె సరిచేసుకుంటూ.

తండ్రి నోటినుండి ఆ మాట రావడంతోనే పరమానంద భరితుడై దరఖాస్తు ఫారం, సర్టిఫికెట్లు ఫైల్లో సర్దుకున్నాడు మురళి.

ఐదో పదిలో కొనసాగుతున్న సగటు మనిషిరమణయ్య తను సముపార్జించిన విజ్ఞానాన్ని పదిమందికీ పంచుతూ, ప్రతిఫలంగా లభించినదానితో తృప్తిగా సంసారం ఈడ్చు కొస్తున్నాడు. అతడికి ముగ్గురు సంతానం, పెద్దవాడు మోహన్ బి.ఎ.పాసై

వైజాగ్‌లో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. నెల నెలా తండ్రికి రెండొందలు పంపుతూ వుంటాడు. తరువాతది సుందరి. పెళ్లి కెదిగి కూర్చుంది. ఆఖరివాడు మురళి. ఆ ఏడే పాసు మార్కులతో సెకెండ్ అయిందనిపించాడు.

రమణయ్య కాలేజీలో అడుగు పెట్టేసరికి ఎన్నెన్నో జ్ఞాపకాల నీడలు కళ్లముందు నర్తించగా భారంగా నిట్టూర్చాడు. అడ్మిషన్ల సమయమవడం వలన ఆఫీసుముందు రద్దీగా వుంది.

"పి.శంకర్రావ్, ఎమ్.ఎ., పిహెచ్‌డి., ప్రిన్సిపాల్ బోర్డుచూసి లోపలకెళ్లాడు రమణయ్య.

"నమస్కారం."

"కూర్చోండి" కుర్చీ చూపించాడు శంకర్రావు చేతులు జోడిస్తూ.

"వీడు మా అబ్బాయి మురళి, ఇంటర్‌లో చేరాలనుకుంటున్నాడు" దరఖాస్తు అందించాడు రమణయ్య.

కొన్ని క్షణాలు వారి మధ్య నిశ్శబ్దం.

"నేనెవరో గుర్తుపట్టారా మాష్టారూ" ప్రశ్నించాడు శంకర్రావు.

"నాకు చూపుసరిగ్గా ఆనదు బాబూ" అంటూ జేబులోంచి అద్దాలు తీసి కళ్లకు తగిలించుకున్నాడు రమణయ్య.

"మీరు కాలేజీ ప్రిన్సిపాలుగా వుండే రోజులలో నేను మీ స్టూడెంటుని."

శంకర్రావు మాటలు తుపాకీ తూటాల్లాగ రమణయ్య గుండెల్ని దూసుకున్నాయి. అంతే, తటాలున లేచి వెనుదిరిగాడు.

"మాష్టారూ!" శంకర్రావు పిలుపు అతడి కర్ణభేరికి చేరిందో లేదో చెప్పడం కష్టం.

తండ్రి వింత ప్రవర్తనకు నోరు వెళ్లబెట్టాడు మురళి.

రమణయ్యకు ఎవరూ కనిపించడం లేదు.

గేటుదాటి రోడ్డుమీద కొచ్చాడు. గతస్మృతులు అతడిని ఉక్కిరి బిక్కిరి చేయసాగాయి. ఉన్న పళంగా అతడి ఆలోచనలు పదిహేను సంవత్సరాలు వెనక్కు మళ్లాయి.

• • •

రమణయ్య యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాలు. అతని పాలనలో అవినీతికి అణుమాత్రం తావులేదు.

క్రమశిక్షణ ఆయన ఆరో ప్రాణం.

పంక్చువాలిటి అతని ఊపిరి.

రికమండేషన్లు ఆయన ముందు బలాదూర్.

అతని సారధ్యంలో కళాశాల ప్రతిష్ఠ వెయ్యిరెట్లు ఇనుమడించిందన్నది స్థానికుల స్థిరమైన అభిప్రాయం.

ప్రముఖ రాజకీయ నాయకుడు శేషాద్రి గారబ్బాయి శంకర్రావు ఆ కాలేజీలో ఇంటర్మీడియేట్ చదువుతున్నాడు. అతడు స్ఫురద్రూపి, మాటకారి, ఐశ్వర్యవంతుడు కావడంతో విద్యార్థులందర్నీ అవలీలగా ఆకట్టుకోగలిగాడు. ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికై విద్యార్థి సంఘ నాయకుడయ్యాడు.

శంకర్రావుకి బుక్సుకంటే డ్రస్సులంటేనే ఇష్టం.

క్లాసులకంటె మ్యాట్నీషోలంటేనే మక్కువ.

ఆకతాయి కుర్రాళ్లను వెంటేసుకుని ఆడ పిల్లల్ని అల్లరి చేయడం అతడి హాబి.

లెక్చరర్సుతో గొడవపడటం సరదా.

ప్రిన్సిపాలుగారికి అతడొక క్వశ్చన్ మార్కు అయిపోయాడు.

శంకర్రావు కాండక్టుమీద కంప్లైంటు చెయ్యని లెక్చరరు లేడు.

రమణయ్యగారు అనేక పర్యాయాలు శంకర్రావుని పిలిపించి గట్టిగా మందలించడం జరిగింది. ఐనా అతడిలో ఆశించిన మార్పు రాలేదు.

ఆ రోజు విద్యార్థులు క్లాసులకు వెళ్లకుండా గేటు వద్ద ఔటర్సుతో ఘర్షణ పడుతున్నారు. వాతావరణం బాగా వేడిగా వుంది. పేరెంటెవరో శంకర్రావు ఫిల్టు పట్టుకుని హెచ్చరిస్తున్నాడు. పెద్ద గొడవ జరిగేటట్లుంది.

లెక్చరర్సు దూరం నుండి ఆ దృశ్యాన్ని తిలకిస్తున్నారు. ఏ ఒక్కరూ అందులో కలుగ జేసుకోవడానికి సాహసించడం లేదు.

రమణయ్యగారు రంగ ప్రవేశం చేసి స్టూడెంట్సుందర్నీ డిస్పర్సు చేసారు. లెక్చరర్లను క్లాసులకు వెళ్లమన్నారు. విద్యార్థులతో ఘర్షణ పడుతున్న వ్యక్తిని ఆఫీసు రూములోకి రప్పించుకుని తగవు కారణమడిగారు.

"క్షమించండి మీ కాలేజీలో మాలాంటి వాళ్లం ఆడపిల్లల్ని చదివించుకోలేం" వ్యథిత హృదయంతో పలికాడావ్యక్తి.

అతని పలుకులు ములుకుల్లా గుచ్చుకున్నాయి. రమణయ్యగారి హృదయంలో.

"ఇంతకు మీకొచ్చిన ఇబ్బంది ఏమిటో సెలవిచ్చారుకాదు."

"చెప్పడం వలన ప్రయోజనం ఉంటుందనుకోను."

"అలా ఎందుకనుకుంటున్నారో నాకు బోధపడటం లేదు. నా గురించి మీకు పూర్తిగా తెలిసినట్లు లేదు. తప్పు ఏదైనా దాన్ని ఖండించడం నా అభిమతం."

"మీ రామాట అన్నారుగనుక చెప్తున్నాను. ఈ కాలేజీ విద్యార్థి శంకర్రావు ఆగడాలకు హద్దులేకుండా పోయింది. ఈ రోజు మా అమ్మాయిని పదిమందిలో ముద్దు పెట్టుకుని పరాభవించాడు. రేపు ఇంకేం చేసినా ఆశ్చర్య పోనవసరం లేదు. పలుకుబడి వున్న రాజకీయ నాయకుని కొడుకని మిన్నకుంటారో లేక అతడు చేసిన తప్పుకు శిక్ష వేసి సంస్థపేరు ప్రతిష్ఠల్ని కాపాడుతారో చూడాలి మరి."

రమణయ్యగారిని సవాలు చేస్తున్నట్లున్నాయి అతని మాటలు.

"మా కాలేజీ విద్యార్థి వలన మీకింత పరాభవం జరిగినందుకు క్షంతవ్యుణ్ణి. నా దృష్టిలో స్టూడెంట్సు అంతా సమానమే. ఎవరు తప్పు చేసినా దండించడం నా కర్తవ్యం. లోపం ఎక్కడున్నా సరిదిద్దడం నా బాధ్యత. ఇంత అల్లరికి కారకుడైన శంకర్రావుని కాలేజీనుండి బహిష్కరిస్తున్నాను" గుమస్తాను పిలిచి టి.సి. తయారు చేయమని పురమాయించారు రమణయ్యగారు.

ప్రిన్సిపాలుగారు తగిన సమయంలో తగిన చర్య తీసుకున్నందుకు అంతా హర్షం వెలిబుచ్చారు.

వారం రోజులు గడిచాయి.

ఉరుకులు పరుగులతో కాలేజీకి వచ్చాడు శంకర్రావు తండ్రి శేషాద్రి.

కోపంలో అతడి ముఖం నిప్పుకణికలా వుంది.

శేషాద్రిగారి రాకతో విద్యార్థులంతా ఏం జరుగుతుందోనని వరండాల మీద కొచ్చారు.

లెక్చరర్సు స్టాఫ్ రూము వదలి ప్రిన్సిపాలు గది ముందు చేరారు.

"మీరేనా ఈ కాలేజీ ప్రిన్సిపాలు" అధికార దర్పాలు అతడి స్వరంలో మూర్తీభవిస్తున్నాయి.

"అనేకదా నా దగ్గర కొచ్చారు" రమణయ్యగారి వదనంలో ప్రశాంతత ఏమాత్రం చెక్కుచెదరలేదు.

"పేరెంటు అప్లికేషను లేకుండా శంకర్రావుకి టి.సి. ఎలా ఇచ్చారు?" ముక్కుపుటాలెగరేస్తూ రూలు తీసాడు శేషాద్రి.

"డిసిప్లినరీ యాక్షన్ క్రింద టి.సి. ఇష్యు చేసేటప్పుడు పేరెంటు దరఖాస్తు అవసరం లేదు" తాపీగా సమాధానమిచ్చారు ప్రిన్సిపాలుగారు.

"మావాడు చేసిన నేరం"

"మీకు తెలియదా"

"తెలిసుంటే అడగవలసిన అవసరం ఉండదనుకుంటాను".

"సరే, మీరడిగేరు గనుక చెప్తున్నాను. మీవాడి కాండక్టు బాగులేదు. ఆ విషయం తెలియపరుస్తూ గతంలో మీకు ఉత్తరం వ్రాయడం జరిగింది. వాడికి అనునిత్యం లెక్చరర్సుతో ఘర్షణపడటం అలవాటు. ఆడపిల్లల్ని టీజ్ చెయ్యడం అతడి నైజం. ఇటువంటి లక్షణాలున్న వ్యక్తి కాలేజీలో చదవటానికి అనర్హుడు. అందుకే టి.సి. ఇచ్చి పంపించేసాను. పంతాలకు, పౌరుషాలకు పోయి మీవాడిని సమర్థిస్తే భవిష్యత్తులో వాడు మరిన్ని తప్పులు చేసే అవకాశముంది. మీవాడంటే నాకు ద్వేషం లేదు. వాడు బాగుపడాలంటే ఈ శిక్ష అనుభవించడం అనివార్యం. వాడిలో పరివర్తన వస్తే వచ్చే ఏడు తప్పకుండా మా కాలేజీకి ఆహ్వానిస్తాను" నచ్చ చెప్పే ధోరణిలో విషయమంతా విపులీకరించారు రమణయ్యగారు.

ఆవేశంలో వున్న శేషాద్రికి ఆయన చెప్పే మాటలేవీ తలకెక్కినట్లు లేదు.

"వచ్చే సంవత్సరం కాదు. ఈ క్షణంలో వాడిని మళ్ళీ జాయిన్ చేసుకోవాలి" పట్టుబట్టాడు శేషాద్రి.

"క్షమించండి అది జరగని పని" సున్నితంగా తిరస్కరించారు రమణయ్యగారు.

"మీరు ఆ మాట అంటారనే జిల్లా విద్యాశాఖాధికారి వారి నుండి ఉత్తర్వు తీసుకొచ్చాను" జేబులోంచి కాగితం తీసి ప్రిన్సిపాలు బల్లమీద వుంచాడు శేషాద్రి.

డి.ఇ.ఓ.గారి ఆర్డర్ని సొంతం పదిమార్లైనా చదివుంటారు రమణయ్యగారు.

రూములో భరించలేనంత నిశ్శబ్దం.

ఆయన ఏం చేస్తారా అని అంతా ఆదుర్దాగా చూస్తున్నారు.

నువ్వు నన్నేమీ చెయ్యలేవన్నట్లు కిటికీ లోంచి వెకిలిగా చూస్తున్నాడు శంకర్రావు.

కొన్ని క్షణాల అనంతరం కాగితం తీసి ఏదో వ్రాసి హిస్టరీ లెక్చరర్ గారిని పిలుచుకు రమ్మని అటెండర్ని ఆదేశించారు రమణయ్య గారు.

"మాష్టారూ! నేను ఉద్యోగానికి రాజీ నామా చేస్తున్నాను. ప్రభుత్వం వారు మరొకరిని నియమించేవరకు మీరే ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు. సంతకం పెట్టండి"

అంటూ సీట్లోంచి లేచారు రమణయ్యగారు.

ప్రిన్సిపాలు చర్యను వీక్షిస్తూ ప్రతిమలా వుండిపోయాడు శేషాద్రి.

"నిదానంగా ఆలోచించండి మాష్టారూ మీరు తొందరపడుతున్నారేమో ననిపిస్తోంది". అన్నారు హిస్టరీ లెక్చరరు హరగోపాల్‌రావు గారు.

"లేదు మాష్టారు. నేనీ స్థితిలో ప్రిన్సిపాలుగా కొనసాగలేను. నా మూలంగా సంస్థ నాశనమవకూడదు. ఇక నాకు సెలవిప్పించండి" రెండు చేతులు జోడిస్తూ గుమ్మం దాటారు రమణయ్యగారు.

● ● ●

"మురళి కాలేజీలో చేరాడా" గుమ్మంలో కాలుపెడుతూనే అడిగింది జానకమ్మ.

"లేదు" త్రుంచినట్లు సమాధానమిచ్చారు రమణయ్యగారు.

"అదేమండి మీరు వెళ్ళినా వాడికి సీటు ఇవ్వనన్నారా?" నిలదీసింది జానకమ్మ.

"ఏ కుర్రాడి వలన నేను పదిమందిలో పరాభవం పొందానో, ఏ అబ్బాయి కారణంగా నేను ఉద్యోగానికి రాజీనామా చేయవలసి వచ్చిందో ఆ కుర్రాడే నేడు కాలేజీ ప్రిన్సిపాలు. మురళి చదువుకోకపోయినా సంతోషంగా అంగీకరిస్తానేమో గాని, ఆ కాలేజీలో వాడు చేరడం నేను భరించలేను జానకీ".

భర్త మాటలకు అవాక్కై పోయింది జానకమ్మ. కొన్ని క్షణాలవరకు ఆమె పెదాలు విడలేదు. తరువాత కాస్త తేరుకుని అంది "ప్రిన్సిపాలు ఎవరైతే మనకేం? మనకు కావలసింది అబ్బాయి చదువు. వాడిని ఇక్కడ కాదని మరో ఊళ్ళో వుంచి చదివించడానికి మనకు స్తోమత ఎక్కడుంది? ఆలోచించండి. ఒకమారు మీరిదే పట్టుదలతో ఉద్యోగాన్ని త్యజించారు. ఇప్పుడు వాడి భవిష్యత్తునే మంట గలపాలనుకుంటున్నారు. దీనికి నేనుససేమిరా అంగీకరించలేను."

"ఔనా మాష్టారూ నా మూలంగా మీకెంతో అన్యాయం జరిగింది" అంటూ లోపల కొస్తున్న శంకర్రావుని చూసి ఆశ్చర్యపోతూ "ఎవరూ? శంకర్రావా?" అన్నారు రమణయ్యగారు.

"మీరు జీవితంలో చీకటిని నింపుకుని నా బ్రతుకులో వెలుగులు పండించారు. మీరు ఉద్యోగం వదిలేసి వెళ్ళిపోయిన మరుక్షణం నాకు కనువిప్పైంది. నేను చేసిన తప్పేమిటో తెలుసుకున్నాను. నన్ను మనస్ఫూర్తిగా క్షమించమని మీ పాదాలమీద

పడాలనుకున్నాను. అప్పటికే మీరు ఊరు విడిచి వెళ్ళిపోయారు. నా తప్పును సమర్థించి మిమ్మల్ని పరాభవించిన పాపానికి మా నాన్న రాజకీయ సన్యాసం పుచ్చుకోవలసిన దుస్థితి వచ్చింది. ఒక మంచి వ్యక్తికి అపకారం చేస్తే దాని ప్రభావం మనమీద తప్పకుండా వుంటుందని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. నా మూలంగా మురళి చదువు పాడవకూడదని అతడు కోరుకున్న బై.పి. గ్రూపుతో ఫీజు కట్టేసి ఎడ్మిట్ చేసుకున్నాను. ఇదిగో రసీదు..."

ఎంతో నమ్రతగా వున్నాయి అతడి పలుకులు.

వివేకం ఉట్టిపడుతోందతడి మాటల్లో.

రమణయ్య జవాబు చెప్పలేక భార్యవంక చూసాడు.

పట్టుదలలు మాని అబ్బాయి చదువుకి సహకరించమని వేడుకొంటునట్లున్నాయి ఆమె నయనాలు.

మరుక్షణం కొడుకు ముఖంలోకి దృష్టి సారించాడు.

"నాన్నా! చేసిన తప్పుకు పశ్చాత్తాప పడుతున్న శంకర్రావు గారిని మన్నించండి. నన్నా కళాశాలలో చదువుకోనివ్వండి" అంటున్నాయి మురళి చూపులు.

● *ఆంధ్రసచిత్ర వారపత్రిక 9.3.90* ●